డయేరియా నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో డయేరియా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి విశాఖపట్నం ఎంపీపీ శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ వి.జానకి, విస్తరణ అధికారి గుండు అప్పలరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మేయర్ పీఠం కోసమే ఆరాటం

కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు మేయర్ లేఖ

విశాఖ నగర ప్రజలు సమస్యలు చర్చించే వేదికపై నిర్లక్ష్యం వద్దని పలువురు కార్పొరేటర్ల ఆవేదన

గ్రేటర్ విశాఖ మేయర్ పీఠంపై టిడిపి కూటమి కన్నుతో ఆలస్యం

చట్టంలో మార్పులు వచ్చాకే సమావేశమా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో 20 లక్షలకు పైబడి నివసిస్తున్న ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జరిగి దాదాపు ఆరు నెలలు కావస్తుంది. ఈ ఏడాది జనవరి 9న ఆఖరి కౌన్సిల్ సమావేశం జరిగింది. స్థాయి సంఘం సమావేశం మార్చి 6న చివరగా జరిపారు. తర్వాత ఎన్నికల కోడ్ కారణంగా అలాంటి సమావేశాలు జరగలేదు. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. తొమ్మిదో తేదీ నుండి కోడ్ ఎత్తివేశారు. ఆయన జీవీఎంసీలో కౌన్సిల్ సమావేశాలు స్థాయి సంఘం సమావేశాలు జరపడానికి అధికారులు ముందుకు రావడంలేదని కొంతమంది కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20వ తేదీన జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు లేఖ రాశారు. మున్సిపల్ చట్టం 1955 ప్రకారం సెక్షన్ 88 ద్వారా కౌన్సిల్ సమావేశం కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని ఉన్నప్పటికీ ఆరు నెలలు కావస్తున్న కౌన్సిల్ సమావేశం జరగకపోవడంపై పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 98 వార్డుల నుండి ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్లు ఉన్నప్పటికీ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించే వేదిక కౌన్సిల్ సమావేశం అయినప్పటికీ అధికారులు ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పాలకవర్గం ప్రస్తుతం వైసీపీ చేతుల్లో ఉండగా, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మేయర్ పీఠాన్ని తమ వశం చేసుకునేందుకు టిడిపి కూటమి నేతలు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలోనే కౌన్సిల్ సమావేశం మేయర్ మార్పు కోసమే జరగాలి తప్ప, సాధారణ కౌన్సిల్ సమావేశం జరగడానికి వీలు లేదని కమిషనర్‌కు టిడిపి కూటమి నేతలు తేల్చి చెప్పినట్లు సమాచారం. రాజకీయ ఎత్తుగడలు, కుర్చీలాట మధ్య ప్రజా సమస్యలు చర్చించే అవకాశం లేకుండా పోతుందని, సీజనల్ వ్యాధులు నగరంలో ప్రబలుతున్నాయని వామపక్ష పార్టీ కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

చట్టంలో మార్పులు వచ్చాకే సమావేశమా..?

జీవీఎంసీ మేయరు పీఠాన్ని కూటమి నాయకులు కైవసం చేసుకోవడానికి పావులు మొదలుపెట్టారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతోనే కమిషనర్ సాయికాంత్ వర్మ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని అంటున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నాలుగేళ్లపాటు మేయరుపై అవిశ్వాసం పెట్టడానికి వీల్లేకుండా చట్టం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని మార్చడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. త్వరలో ఆ దిశగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి తర్వాత అసెంబ్లీలో బిల్లు పెట్టే అవకాశం ఉందని తెలుస్తుంది. ఆ దిశగా చట్ట సవరణ కు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ జీవీఎంసీ యే , మూడేళ్ల కిందట జరిగిన కార్పొరే షన్ ఎన్నికల్లో వైకాపా నగరంలోని మెజా రిటీ వార్డులను కైవసం చేసుకుంది. దీంతో మేయరు పీఠం ఆ పార్టీ నాయకురాలు గొలగాని హరి వెంకటకుమారికి దక్కింది. డిప్యూటీ మేయర్, స్థాయీ సంఘం సభ్యులు ఇలా అన్ని పద వులు వారికే దక్కాయి. దీంతో మూడేళ్లపాటు వైకాపా నాయకులు ఆడిందే ఆటగా సాగారు. వైకాపా పెద్దలు సమన్వయకర్తలు చెప్పినట్లే పాలకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగం జరిగిందని విపక్షాల కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో వారి ఆట కట్టించాలని తెదేపా, జనసేన, భాజపా నాయ కులు భావిస్తున్నారు. విశాఖ పట్నం నుంచి ఎన్నికైన ఏడుగురు కూటమి ఎమ్మెల్యేలు ఇదే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించడం, ఆయన సూచన ప్రాయంగా అంగీకరించినట్లుగా చెబుతు న్నారు. చట్ట సవరణ జరిగితే జీవీఎంసీ మేయరుగా ఓ వ్యక్తిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. కూటమిలో తెదేపా, జనసేన, భాజపా భాగస్వామ్యం కావడంతో ఉప మేయర్లు, ఫ్లోర్ లీడర్ పదవులను పంచుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం నగరంలో 97 మంది కార్పొటర్లు ఉన్నారు.

21వ వార్డు నుంచి ఎంపి కైన వంశీకృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి ఏడుగురు వైకాపా కార్పొరే టర్లు మద్దతిస్తే కూటమి బలం 54కు చేరి, వైకాపా బలం 52కు తగ్గ తుంది. తద్వారా మేయరు పీఠం టీడీపీ కూటమికి దక్కినట్లేనని తెలుస్తోంది. ఆ దిశగా ఇప్పటికే తెదేపా నాయకులు పావులు కదుపుతున్నారు. తెదేపా కార్పొరేటర్లు 29 మంది ఉండగా, జనసేన కార్పొరేటర్లు 3, భాజపా 1, ఎమ్మె ల్యేలు 7, ఎమ్మెల్సీలు 2, ఎంపీ 1, మద్దతిస్తున్న స్వతంత్ర కార్పొరేటర్లు 4. మొత్తం సంఖ్య 47, (సీపీఐ 1, సీపీఎం 1, వీరు తటస్థంగా ఉండే అవకాశం ఉంది.) వైకాపా కార్పొరేటర్లు 58, ఎమ్మెల్సీ 1,వున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓటమి పాలు కావడంతో మరి కొంతమంది కార్పొరేటర్లు టిడిపి కూటమికే జై కొడతారని తెలుస్తోంది. ఇప్పటికే వైసిపి సమన్వయకర్త ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కార్పొరేటర్లతో సమావేశమై మేయర్ పీఠాన్ని వదులుకోవద్దని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీలకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం పలు విభాగాల్లో కొంతకాలంగా గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించారని, తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని గెస్ట్ ఫ్యాకల్టీలు కోరారు. ఏయూ పరిపాలన భవనం ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులకు పలు ప్రజా విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా ఆంధ్రాయూనివర్సిటీలో కొరవడిన ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలన్నారు. వర్సిటీలో గత ఐదేళ్లుగా వీసీ ప్రసాదరెడ్డి నియంతృత్వ పాలనలో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు చాలా ఇబ్బందులకు గురయ్యారని ఆరోపించారు. గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించడం, ఎయిడెడ్ అధ్యాపకుల్ని డిప్యూటేషన్ పేరుతో తీసుకొచ్చి విద్యావ్యవస్థను నాశనం చేయడాన్ని తప్పుపట్టారు. డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత్ బచావో విశాఖ జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్.ఆర్.వేమన, ఆప్ పార్టీ కన్వీనర్, డా. సీతాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నుంచి సుధాకర్, లోకసత్తా సుధీర్, విధసం ఐక్య వేదిక బూసి వెంకట్రావు, భీం సేన వార్ చిన్నారావ్, సిటు అప్పారావు, సమాజ వికాసం సత్యనారాయణ, డివైఎఫ్ఐ రాజు, యువజన సంఘం రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయుడు, ఏఐవైఎఫ్ శ్రీనివాస్, ఏఐడీఎస్ఓ అభిలాష్, గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ భాను, సురేష్ మీనన్, కల్యాణి, ఉత్తరాంధ్ర దళిత సంఘం శ్యామ్ సుందర్, సీపీఐ ఎంఎల్ దేవ, టీడీపీ బీసీ సెల్ ఉత్తరాంధ్ర రామ్ మోహన్, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం క్షేత్ర పాల్, ఐపిబిపి సుజాత తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి నిత్య కళ్యాణం, గరుడ సేవ, తదితర ఆర్జిత సేవలు నయనానందంగా జరిగాయి. వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో వైభవోపేతంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యా హవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాంద్రంగి పంచాయతీ ఏనుగుపాలెం గ్రామంలో అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక తహశీల్దార్‌కు వినతి అందజేశారు. ఏనుగుపాలెం గ్రామంలో సర్వేనెంబర్ 317 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నెం.317రులో ప్రభుత్వం భూమిని గ్రామస్థులకు ఇళ్ళ స్థలాలు మంజురు చేశారని, ఈ సర్వే నెంబరులో గల భూమి గ్రామస్థులందరికీ పశువులు, మేకలు, వగైరాలు మేతలకు ప్రజల అవసరార్థం ఉపయోగపడు తుందన్నారు. వర్షాకాలంలో తీవ్రమైన తుఫానులు సంభవించినప్పుడు గ్రామ ప్రజలందరికీ ఇది ఎంతో ఉపయోగకర స్థలంగా ఉందన్నారు. గ్రామస్థులందరికీ ఉపయోగకరమైన ఈ స్థలాన్ని కొంత మంది వ్యక్తులు దురాక్రమణ చేసి అక్రమంగా శాశ్వత నిర్మాణాలు, పాక్షిక నిర్మాణాలు చేసి వారి స్వాధీనంలో ఉంచుకున్నారని అన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించి ప్రజలు సామాజిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సేవలతోనే గుర్తింపు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని స్టీల్ ప్లాంట్ ఎం.ఎం.ఎస్.ఎం విభాగాధిపతి సైబాల్సెన్ అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న డి.జి.ఎం టి.సాంబశివరావు ఆత్మీయ సత్కార కార్యక్రమం మంగళవారం ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి సైబాల్ సేన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేయనున్న సాంబ శివ రావు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి ఉక్కు ప్రగతికి కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా డిజిఎం సాంబ శివరావు దంపతులను జ్ఞాపిక, శాలువా, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తివారీ, పాల్, ఏ.వి.సత్యనారాయణ, ఎం.చంద్ర శేఖర్, ఎం.డి బోయర్, సి.హెచ్ .శివ రామ కృష్ణ , మనోజ్ ఓరాన్, డి.శ్రీనివాస్, గోపి శంకర్, వేణు గోపాల్, టి. వేణు, ఉద్యోగులు జి.ఆనంద్, బి.వెంకటేశ్వరరావు, ఐ.చిట్టి బాబు, డి.దేముడు, డి. రమేష్ పాల్గొన్నారు.

చెట్టు నుంచి జారిపడి కల్లు గీత కార్మికుడు మృతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: చెట్టు నుండి జారి పడి చికిత్స పొందుతూ కల్లు గీత కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న కుప్ప నూకరాజు ఈనెల 15వ తేదీన కల్లు తీసేందుకు చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. గాయాల పాలైన నూకరాజు చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్ చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భార్య మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని దుర్గాలమ్మ చెట్టు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉందని, అతనిని కనుగొనేందుకు అతని వద్ద ఎటువంటి వివరాలు లేవని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి పోస్టుమార్టం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి

మాల మహానాడు వ్యవస్థాపకులు గోపాలరావు

విశాలాంధ్ర - భీమిలి: గతంలో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27 పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాలరావు అన్నారు. ఈ సందర్భంగా భీముని పట్నం అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాలరావు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే జగనన్న విదేశీ విద్య రద్దు చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విదేశీ విద్యను ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పునరుద్ధరణ చేసి ఎస్సీ కార్పొరేషన్ నిధులను ఇచ్చి ఎస్సీలను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో వైసీపీ కార్యాలయాలు రాజభవంతుల్లా నిర్మిస్తున్నారని అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక చోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దోచుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గత వైసిపి ప్రభుత్వంలో విశాఖ జిల్లాలో కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో పెందుర్తి ముదపాక ఎస్సీ భూములు నుండి భీమిలి మండలం నేర్లవలస భూముల వరకు అనేక అక్రమాలకు జరిగాయని ఆరోపించారు. వీటిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలు పంచాయతీలలో గెడ్డ వాగు పై సుప్రీంకోర్టు ఇచ్చిన జీవోకు విరుద్ధంగా అనేక సిసి రోడ్లు నిర్మించి ప్రజాధనాన్ని ఖూనీ చేశారన్నారు. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఉన్నత విద్యకు అవకాశం చేకూర్చాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎడ్ల రమేష్, పొట్నూరు రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే నిరుద్యోగులకు న్యాయం

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: టీడీపీ హయాంలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని శాసనమండలి సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని, టీడీపీ ఏర్పడిన తరువాత ఉపాధ్యాయ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. టీడీపీ హయంలో మాత్రమే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఎస్సీపై మొదటి సంతకం చేశారని తెలిపారు. నారా లోకేష్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సంతకం డీఎస్సీ విధివిధానాలపై పెట్టారని, రాష్ట్రంలో నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయన్నారు. జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులను అన్ని విధాలా మోసం చేశారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన సరిగ్గా చేయ లేదని వాస్తవాలను ఒప్పుకోవడం లేదని, చంద్రబాబు, జగన్ పాలనలకు మధ్య తేడాను ప్రజలు, నిరుద్యోగులు గమనిస్తున్నారన్నారు. నిరుద్యోగులు తరుపున అనేక సమస్యలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్ళామని, మంత్రి లోకేష్ అన్ని అంశాలపైన సానుకూలంగా స్పందించారని, తొందరలో కూటమి ప్రభుత్వం నుంచి జాబ్ క్యాలండర్ వస్తుందని చెప్పారు. గ్రూప్ 2ను రెండు నుంచి మూడు నెలలు వాయిదా వేయమని కోరామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాలలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదని ఎద్దేవా చేశారు. కళాశాలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు వైఖరిని మార్చుకొని నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలలో చంద్రబాబు నాయుడు నూతనంగా కౌన్సిలింగ్ విధానం తీసుకు వచ్చారన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు డి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్క్యులర్ ఎకానమిపై గీతంలో అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నాయని సదస్సు ఛైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా వి.పప్పు, సదస్సు కన్వీనర్ డాక్టర్ వై.ఎల్.పి.తోరణిలతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వివిధ రకాల పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, పట్టణాలు, రోజువారి జీవితంలో వినియోగించే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలు వంటివి తిరిగి వినియోగించే రీసైకిలింగ్ పద్ధతులతో కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమి అంటారని వారు తెలిపారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్మెంట్ - సర్క్యులర్ ఎకానమి, ఐఎస్‌డబ్ల్యూఏ గ్లోబల్ ఫోరమ్ -2024 పేరిట జరిగే ఈ సదస్సులో 60 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని అలాగే 400 వందలకు పైగా పరిశోధన పత్రాలను వివిధ రంగాల నిపుణులు సమర్పించనున్నారని తెలిపారు. సదస్సులో భాగంగా నవంబర్ 27వ తేదీన స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని దీనికి దేశంలోని 600 పాఠశాల విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరికొత్త పద్ధతులను, వాణిజ్య సముదాయాలను ఉపయోగిస్తున్న పరిశ్రమలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను అందజేస్తామన్నారు. సదస్సులో భాగంగా పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గీతంతో కలిసి పలు వ్యర్థ పదార్థాలు నిర్వహణ ప్రాజెక్టులను చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సదస్సు గోడ పత్రికను, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

అక్రమాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

7వ వార్డు కార్పొరేటర్ మంగమ్మ

విశాలాంధ్ర - మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మానం ఆంజనేయులు నగర్‌లో జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆ అక్రమాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించ నున్నట్లు ఆ వార్డు కార్పొరేటర్ పిల్ల మంగమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమెతో పాటు ఆమె భర్త టిడిపి నాయకులు పిల్లా వెంకట్రావు మాట్లాడారు. ఆ కాలనీ బాధితులు ఆ కాలనీలోని సంఘం ముసుగులో అనేక అక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ పట్టాలు కూడా సృష్టిస్తున్నారని వాటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు కనిపించడం లేదని వివరించారు. ఆ అక్రమాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నామని ప్రకటించారు.

గ్రామీణ వైద్యుల సేవలు అమోఘం

విశాలాంధ్ర - ఆనందపురం: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పద్మావతి డయాగ్నొస్టిక్స్ సహకారంతో వైద్య విద్య అవగాహన సదస్సు పెద్దిపాలెం ప్యారడైజ్ ఫంక్షన్‌హాలులో జరిగింది. డాక్టర్ స్వామి నాయుడు, నర్సింగ్ హోమ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి నాయుడు, రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ సలహాదారులు డాక్టర్ ఎన్.ఎల్.రావు పాల్గొన్నారు. పద్మావతి నాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఎల్లప్పుడూ గ్రామీణ వైద్యులు అందుబాటులో ఉండి అమోఘమైన సేవలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ ఎన్ఎల్.రావు మాట్లా డుతూ క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసి ఆర్ఎంపి కూడా పరిధి దాటకుండా వైద్యం చేసేందుకు అవసరమైన వైద్య విజ్ఞానాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్య క్రమంలో సంఘ వ్యవస్థాక అధ్యక్షుడు జంగం జోషి, సంఘ గౌరవ సలహాదారులు మమ్ముల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎస్.సుగినేశ్వరి, క్యాన్సర్ ఫౌండేషన్ సెక్రటరీ కోనా ప్రకాష్, స్థానిక సంఘ నాయకులు కే.ఎన్. రావు, సుధాకర్ రెడ్డి, పచ్చిపులుసు కనకారావు, రామకోటేశ్వరరావు, అను, రాలి అప్పారావు, మంగ శివప్రసాద్, జిబి రాజు తదితరులు పాల్గొన్నారు.

హయగ్రీవ భూములు
స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లా ఎండాడ గ్రామం సర్వే నెం:92/3లో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డేవలోపర్స్ సంస్థ వారు సకాలంలో అనదాశ్రమం, వయో వృద్ధాశ్రమం నిర్మించి వినియోగంలోకి తేవడంలో విఫలమై, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నందున ఆ భూమి ని స్వాధీనం చేసుకోవాలి. నిర్మాణ పనులు నిలిపివేసి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మంగళవారం సాయంత్రం జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. విశాఖపట్నం జిల్లా ఎండాడ గ్రామం సర్వే నంబర్ 92/3 లో 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని 2008 లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు నంబర్ 1447 తేది: 06-12-2008 ప్రకారం 10 శాతం స్థలంలో అనదాశ్రమం, వృద్ధాశ్రమం ఏర్పాటు, మిగతా 90 శాతంలో వయోవృద్ధులకు మాత్రమే గృహ నిర్మాణాలు చేసి విక్రయించే నిబంధనలతో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని కేటాయించారు. సకాలంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో హయగ్రీవ సంస్థ విఫలం కావడంతో రెవిన్యూ అధికారులు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వెనక్కు తీసుకు న్నారు. దీనిపై హయగ్రీవ వారు కోర్టులో సవాల్ చేయగా మూడేళ్లలో ప్రభుత్వం కేటాయించిన ప్రతిపాదిత ప్రాజెక్టు అనగా 10శాతం లో అనాధ, వృద్ధాశ్రమాన్ని మూడేళ్ల నిర్మాణం చేసి 90శాతంలో వయోవృద్ధులకు గృహ నిర్మాణ ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలని కోర్టు తీర్పు ఇచ్చి%శీ%ది. సకాలంలో ప్రాజెక్ట్ పూర్తి చెయ్యకుండా ఈ ప్రాజెక్టు ప్రయోజనాలను విస్మరించి 26 మంది ప్రయివేట్ వ్యక్తులకు 32,000 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసియున్నారు. స్థల కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ రిజిస్ట్రేషన్లను రిజిస్ట్రేషన్ శాఖవారు గుర్తించి రద్దు చేసియున్నారు. భూమి క్రమబద్ధీకరణ, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌళిక సదుపాయాలు కల్పించకుండానే వెయ్యి, రెండువేలు గజాలను ప్లాట్స్ రూపంలో విక్రయించారు. సుమారుగా రూ.500 కోట్ల విలువైన భూముల్లో అక్రమ ఆర్థిక భూ లావాదేవీలు జరపడం తదుపరి అంశాలు పరిగణనలోకి తీసుకుని హయగ్రీవ సంస్థ కు కేటాయించిన ఎండాడ సర్వే నెంబర్ 92/ 3 లోని 12.50 ఎకరాల భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, గత 2022 డిసెంబర్ 27 వ తేదీన ఈ విషయం పై తమరికి లిఖితపూర్వకంగా స్పందనలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఫిర్యాదుపై చర్యలు తీసుకోక పోగా నిర్మాణ పనులకు అవకాశం కల్పించడం చట్ట విరుద్ధం అని, పనులను ఆపి స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మూర్తి యాదవ్ కోరారు.

సౌండ్, స్టైల్ అల్టిమేట్
ఫ్యూజన్ ప్రారంభించిన శామ్సంగ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శామ్సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, ఈరోజు భారతదేశంలో తన మ్యూజిక్ ఫ్రేమ్‌ను ఆవిష్కరించింది. వైర్‌లెస్ స్పీకర్ ఒక కళాఖండం వలె కనిపిస్తుంది ఈ మ్యూజిక్ ఫ్రేమ్ డాల్బీ అట్మోస్ మరియు వైర్‌లెస్ మ్యూజిక్ స్ట్రీమింగ్ వంటి కొత్త ఫీచర్‌లతో కేవలం రూ. 23,990 వద్ద లభిస్తుంది. స్టైలిష్ వైర్‌లెస్ స్పీకర్ను పిక్చర్ ఫ్రేమ్‌గా చేయడం ద్వారా మునుపెన్నడూ లేని విధంగా లివింగ్ రూమ్‌లో చక్కగా సరిపోతుంది. నిజమైన ఫ్రేమ్ వలె శామ్సంగ్ మ్యూజిక్ ఫ్రేమ్, వినియోగదారులు వారి ఫోటోలను పెట్టుకునే గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. విలువైన జ్ఞాపకం లేదా కళాఖండం యొక్క ఫ్రేమ్డ్ ఫోటోను చూస్తూ సంగీతాన్ని వినడం వినియోగదారుల అనుభవాలకు కొత్త స్థాయిలను జోడిస్తుంది. శామ్సంగ్ మ్యూజిక్ ఫ్రేమ్ ఈరోజు నుండి సాంసంగ్ డాట్ ఇన్, అమెజాన్ డాట్ ఇన్ ఎంపిక చేసిన ఆఫ్‌లైన్ స్టోర్‌లలో అందుబాటులో ఉంటుంది. "ఆధునిక వినియోగదారులు కార్యాచరణ మరియు సౌందర్యాన్ని మిళితం చేయడమే కాకుండా, దృశ్యమాన ఆకర్షణను కూడా జోడించే ఉత్పత్తులను ఎక్కువగా కోరుకుంటున్నారు. వారి లివింగ్ రూమ్ యొక్క వాతావరణాన్ని మెరుగుపరచడంతోపాటు వారి వ్యక్తిత్వాన్ని మరియు శైలిని వ్యక్తీకరించే వస్తువుల అవసరం ఈ ట్రెండును ముందుకు తీసుకెళుతుంది. "కొత్త మ్యూజిక్ ఫ్రేమ్ అద్భుతమైన సాంకేతికతను కలిగి ఉండటంతో, ఇది సినిమాటిక్ ఆడియో అనుభూతిని అందిస్తూనే దాని విలక్షణమైన, సొగసైన డిజైన్‌తో పిక్చర్ ఫ్రేమ్ రూపంలో ఆడియోను అందిస్తుంది," అని మోహన్‌దీప్ సింగ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, విజువల్ డిస్‌ప్లే బిజినెస్, శామ్‌సంగ్ ఇండియా అన్నారు.

మ్యూజిక్ ఫ్రేమ్ వినియోగదారులకు వైర్-రహితంగా మ్యూజిక్ ను ఆస్వాదించే సౌలభ్యాన్ని అందిస్తుంది,

అదే సమయంలో రిచ్, క్లియర్ ఆడియోతో ఏదైనా స్థలాన్ని నింపే అత్యుత్తమ ధ్వని నాణ్యతను అందిస్తుంది. దాని వ్యక్తిగతీకరించిన, ఫ్రేమ్డ్ ఆర్ట్‌వర్క్ హెూమ్ డెకర్‌ను మెరుగుపరుస్తుంది, ఇది లివింగ్ రూమ్లను మరింత ఆహ్లాదంగా చేయదానికిదానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించాలనే శామ్‌సంగ్ అభిరుచిని ప్రతిబింబిస్తుంది. ఇది ఏ ఇంటికి అయినా ఒక శక్తివంతమైన జోడింపుగా ఉంటుంది, అద్భుతమైన విజువల్ అప్పీల్ మరియు అద్భుతమైన ఆడియో పనితీరును అన్నింటిని ఒకే సొగసైన పరికరంలో అందిస్తుంది.

అమెజాన్ ప్రైమ్
నూతన క్యాంపెయిన్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 'జాయ్ ఆఫ్ మోర్ (ఎక్కువలో ఆనందం)' యొక్క సారాన్ని కనుగొనటానికి ప్రత్యక్ష స్వరూపం అమెజాన్ ప్రైమ్. ఒక మెంబర్షిప్తో సభ్యులు పలు రకాల లాభాలను పొందగలుగుతారు. వాటిలో పఠనం, గేమింగ్, మ్యూజిక్ మొదలుకుని షాపింగ్ వరకు, షిప్పింగ్, వినోదం, ఇంకా ఎన్నో ఉన్నాయి. సర్వసమాగమమైన ఈ సభ్యత్వం, వారి జీవితాల్లో ప్రతి అంశాన్ని పరిపుష్టం చేసే అసమానమైన అనుభవాన్ని అందిస్తూ సచ్ మెయిన్ టూ మచ్‌లో స్ఫూర్తిని చక్కగా ఇముద్చు కుంటుంది. ఈ ఆలోచనను కొనసాగిస్తూ అమెజాన్ ప్రైమ్, ఇరుగు పొరుగు వారి మధ్య జీవితంలో జరిగే సన్నివేశాలను చూపి, తద్వారా ఫ్రీ సేమ్-డే డెలివరీ, అపరిమితమైన సేవింగ్స్ మరియు బ్లాక్బస్టర్ ఎంటర్టైయిన్మెంట్ ద్వారా ప్రైమ్ మెంబర్షిప్ అందించే విలువను నొక్కి చెప్పే టెలివిజన్ మరియు డిజిటల్ వ్యాపార ప్రకటనగా విజయవంతమైన క్యాంపెయిన్ స్వచ్ఛమైన టూ మచ్, రెండవ వాయిదతో తిరిగి ముందుకు వస్తోంది. కొత్త కస్టమర్ల కోసం ప్రైమరీ మెంబర్షిప్ చుట్టూ ఆశయం కల్పించటం, ప్రస్తుతం ఉన్న కస్టమర్లకు లాభాలను నొక్కి చెప్పే, తమతో అనుబంధం కలిగి ఉండే సందర్భాలను ఈ క్యాంపెయిన్ చూపుతుంది.ఈ రెండు టీవీసిలు (మల్టీ-బెనిఫిట్ ఎ స్పీడ్) స్పీడ్, సేవింగ్స్ మరియు బ్లాక్బస్టర్ ఎంటర్టైయిన్మెంట్ వలన కలిగే లాభాలను చూపుతాయి. అదే రోజు డెలివరీ, అమెజాన్ పే ఐసిఐసిఐ క్రెడిట్ కార్డుతో జే5 శాతం క్యాష్బ్యాక్, విస్తృతమైన సెలక్షన్, మరియు వినోదం వంటి ప్రైమ్ లాభాలను ఈ రెండు ఫిల్ములు పునరుద్ఘాటిస్తాయి. మరింత వైవిధ్యభరి తంగాను, ఇంటరాక్టివ్గానూ ఆవిర్భవించిన, వినోదంతో కూడుకున్న అమెజాన్ ప్రైమ్ మస్కట్లు - బాక్స్పోలిస్‌ను ఈ క్యాంపెయిన్ సజీవంగా చేస్తుంది.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర - గొలుగొండ: యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎక్సైజ్ సబ్ ఇనస్పెక్టర్ రహీం అన్నారు. గొలుగొండ మండలం పాత మల్లంపేట ప్రభుత్వ పాఠశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రగ్ రహిత సమాజం 9, 10, తరగతులు విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై రహీం మాట్లాడుతూ విద్యార్థి దశనుండే మత్తు పదార్థాలకు దూరంగా వుండి డ్రగ్ రహిత సమాజం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో పెద్దలు కానీ గ్రామస్తులు కానీ గంజాయి, సారాయి మొదలైన మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని, వాటిని రవాణా చేసే వ్యాపారుల వలలో పడి జీవితాలు నాశనం కాకుండా వారిని చైతన్య పరచవలసిన అవసరం విద్యార్థులు యువతపై వుందన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను, వాటి రవాణా చేయడం వంటి చట్టవ్యతిరేక చర్యలను వివరించారు.

జివిఎంసిలో స్టాప్ డయేరియాపై
ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్టాప్ డయేరియాపై ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడమైనదని కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ (డెవలప్మెంట్) కె.ఎస్.విశ్వనాథన్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అతి సారవ్యాధి వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సిటీ ఆపరేషన్ సెంటర్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్ 24/7 పనిచేస్తుందని, మురుగు నీరు నీటి సరఫరాలో కలుషితమైనా, కాలువలు, గెడ్డలు పొంగిపొరలినా, మలేరియా, డయేరియా, డెంగ్యూ వ్యాధులు సోకినా వెంటనే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 0891-2869109కు ప్రజలు ఫోన్ చేయవచ్చని తెలిపారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2024 కార్యక్రమం జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రెండు నెలలు పాటు కొనసాగుతుందని తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయ ఏఎన్ఎం లతో ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ప్రత్యేక పరిశుభ్రత పై అవగాహన, వ్యర్థాల సేకరణ, ప్రజా మరియు సామాజిక మరుగుదొడ్లు ప్రతిరోజు శుభ్రపరచడం, ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు చేపట్టడం, సురక్షిత త్రాగునీరు సరఫరా, గెడ్డలు, కాలువలలో పూడికలు తొలగింపు, ఇంటింటికి అతిసార వ్యాధి, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడం, పరిశుభ్రత కలిగి ఉండాలని, మొదలైన జాగ్రత్తలు తీసుకొవాలని తెలిపారు. ప్రతిరోజు డయేరియా, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై నివేదిక సమర్పించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ను కమీషనర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి అతిసారవ్యాధి కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని, అతిసార వ్యాధి వ్యాప్తి పై ప్రజల అవగహన కొరకు హెూర్డింగులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవిడి ఫణి రామ్ ను ఆదేశించారు. నగరం లో గల ప్రజా మరియు సామాజిక మరుగు దొడ్లులో మౌళిక సదుపాయాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రధాన వైద్యాధికారికి కమీషనరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.వర్మ, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్.రవి, బయాలజిస్ట్ సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చీకటి రోజులు గుర్తు చేసుకుందాం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో వెల్లంకి గ్రామంలో బిజెపి పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. బిజెపి విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు, ఎమర్జెన్సీ చీకటి రోజులు గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. అప్పటి ప్రధానమంత్రి నెహ్రూకి కూతురు అయిన ఇందిరా గాంధీ కూడా తండ్రికి తగ్గ తనయే.కుట్రలతో కూడిన నాటకీయ పరిణామాల వలన, మహాను భావుడు లాల్ బహదూర్ శాస్త్రిగారి (అనుమానాస్పద హత్య లాంటి) మరణంతో సునాయాసంగా ప్రధాని పదవిలోకి వచ్చిన ఇందిరా గాంధీకి దేశ ప్రజలన్నా ,దేశంలోని వ్యవస్థలన్నా ఎంత అలుసో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి, నియంతగా మారి, దేశాన్ని అల్ల కల్లోలం చేసిన ఇందిరా గాంధీ నిజ రూపం ఎమర్జెన్సీ అరాచకాలలో బయట పడిందన్నారు. ఇందిరాగాంధీ భారతదేశపు ప్రధానమంత్రిగా అధికారం చెలాయిస్తున్న కాలమదన్నారు. దేవకాంత్ బారువా అనే ఒక కాంగ్రెసు నాయకుడు 1975 జూన్ 12వ తేదీనాడు అలహాబాదు హైకోర్టు న్యాయమూర్తి జగన్‌మోహన్ సిన్హా ఒక తీర్పు వెలువరించారు. లోక్‌సభకు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదు అని ప్రకటించారు. అంతేకాదు దాదాపు ఆరు సంవత్సరాలపాటు ఆమె రాజకీయ ప్రత్యక్ష జోక్యంపై ఆంక్షలు విధించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బోర శ్రీను, పోతిన జీవన్ సంతోష్, బంక సీతం నాయుడు, కె.వి.వి.సూర్యనారాయణ, పి.చిన్నారావు, ఇంటి సత్తిరాజు, ఉప్పాడ శివ, మల్లరాపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు
100 రోజుల ప్రత్యేక ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణా ఇతర డ్రగ్స్ నివారణకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్పీసీ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారుల నుండి తెలుసుకొని త్వరితగతిన దర్యాప్తు చేయుటకు పని సూచనలు చేస్తూ, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా ఒరిస్సా సరిహద్దు జిల్లాల నుండి ఏజెన్సీ ప్రాంతం వైపు నుండి వివిధ మార్గాల్లో గంజాయి అక్రమ రవాణా నిరోధించేందుకు అనకాపల్లి జిల్లాలో నాలుగు స్టాటిక్ చెక్ పోస్టలను ఏర్పాటు చేయడంతో పాటు డైనమిక్ వెహికల్ చెక్ పాయింట్లను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా జిల్లాలో 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి రవాణా కు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రవాణా జరిగే మార్గాలను గుర్తించి వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టులు చేయడం, తరచూ నేరం చేసే గంజాయి నేరస్తుల మీద %ూ౫చీణూూ% చట్టం, పీడీ యాక్ట్, ఎక్స్టర్నమెంట్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరస్తులు అక్రమంగా సంపాదించిన ఆస్తులను చట్టప్రకారం స్వాధీనపరుచుకోవడం గురించి కూడా చర్చించారు. జూన్ 26న జరుపుకునే అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు, అవగాహన సదస్సుల రూపంలో చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్ అందరి పైన, ప్రత్యేక నిఘా ఉంచి, తరచూ వారికి కౌన్సిలింగ్ ఇస్తూ నేర ప్రవృత్తికి దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూన్ 29న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కాంపౌండబుల్ కేసులను స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ తమ సిబ్బందితో ప్రత్యేక ప్రణాళికతో పనిచేసి, కోర్ట్ కానిస్టేబుల్స్/కోర్ట్ మానిటరింగ్ సెల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సమన్వయం ద్వారా ఎక్కువ కేసులు డిస్పోజ్ చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇరు పార్టీలు స్వచ్ఛందంగా రాజీ చేసుకోదగిన కేసుల్లో ఉభయ పక్షాల వారిని లోక్ అదాలత్ ప్రవేశపెట్టడం వలన ప్రజలకు సమయం వృధా కాకుండా మరియు డబ్బు వృధా కాకుండా చేయగలిగిన వారమవుతమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే, ఇతర రోడ్డు మార్గాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలన్నారు. ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం దృష్ట్యా వారి సమస్యలను తెలుసుకుని అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, దిశా డీఎస్పీ శ్రీ ఎం.ఉపేంద్ర బాబు, ఇనస్పెక్టర్ లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, గణేష్, సతీష్, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయాన్ని
కాపు సామాజిక భవనంగా కేటాయించాలి



విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కాపుల సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని దురాక్రమణకు పాల్పడి, ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెం రెవెన్యూ పరిధిలో గల కొత్తూరు నర్సింగరావుపేట వద్ద నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద బీజేపీ, టీడీపీ, కూటమి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. కాపులకు పెద్దఎత్తున మేలు చేస్తానని నమ్మబలికి, అప్పటి మంత్రి గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మోసగించారని, వారు కాపుద్రోహులుగా నిలిచిపోక తప్పదని హెచ్చరించారు. జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెం రెవెన్యూ, కొత్తూరు నర్సింగరావుపేటలో సర్వే నెం.75/3 నందు గల 1. 75 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపుసామాజిక భవనానికి కేటాయించి, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కాపు ద్రోహులైన అప్పటి మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ నమ్మబలికారన్నారు. అంతలోనే అదేస్థలాన్ని వైసీపీ కార్యాలయానికి కేటాయించడంతోపాటు ఎన్ని అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తమైనా ఎటువంటి ప్రజామోదంగానీ, ప్రభుత్వపరంగా అనుమతులుగానీ లేకుండా దౌర్జన్యంగా వైసీపీ మహల్‌ను నిర్మిస్తున్నారన్నారు. దీనిపై ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను పరిగణ నలోకి తీసుకోకుండా అధికారులు కళ్లు మూసుకోవడంతో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న కాపులతోపాటు జిల్లావాసులంతా వైసీపీ నేతలను చిత్తుగా ఓడించి, గుణపాఠం చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో కేటాయించిన అనుమతులు కాపుల స్థలంలో లేకుండా వైసీపీ కార్యాలయాన్ని కూల్చేసి, అక్కడకాపులకు సామాజిక భవనం నిర్మించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. వైసీపీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేయడంతోపాటు నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయం పైకెక్కి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో 84వ వార్డు టీడీపీ నేత, బీసీ సంఘం నాయకులు మాదంశెట్టి నీలబాబు, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, రాజుపాలెం మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు దూలం గోపి, టీడీపీ నేతలు నార్పుని చంద్రశేఖర్, కాయల మురళి, కశింకోట మండల టీడీపీ అధ్యక్షుడు గొంతున శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, ఉగ్గిన రమణమూర్తి, నిమ్మదల సన్యాసినాయుడు, కర్రి బాబీ, బొద్దపు ప్రసాద్, తాడి రామకృష్ణ, గల్లా కొండలరావు, సకలా గోవిందు, పచ్చికూర రాము, కర్రి సత్యనారాయణ, సందిన సునీల్ కుమార్, అప్పికొండ గణేశ్, గంగుపాం జగదీష్, తలారి కాశీనాయుడు, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, బంటు రవి, కొప్పాక బిజెపి నాయకులు నెట్టమి నాగేశ్, పల్లెల నాగేశ్వరరావు, రొంగలి సూరిబాబ్, గంగ పాము మహేష్ పాల్గొన్నారు.